ఏలుకో ... ఏలుకో

చీమల బారులా ఎడ్లబండ్లు, పొడుగ్గా, ఓపికగా, తీరికగా నడుస్తున్నాయి. బళ్లలో కునుకు తీస్తున్నవారికి గిత్తల మెడల్లోని గంటల శబ్దం ఎక్కడనుంచో వినవస్తున్నట్టు అనిపిస్తోంది.

"చూడక్కా! ఎంత బద్ధకంగా తెల్లవారుతోందో?"

"...ఏమన్నావ్." జానకికి తెలివి వచ్చి అడిగింది.

"పూర్తిగా చీకటిపడే ముందున్న మసకకీ, తెల్లవారే ముందున్న మసకకీ తేడా ఏమిటంటావ్?" కమల అడిగింది.

"నిద్రకు ముందూ వెనకా ఉండే మత్తులో తేడా!" కాలేజీలో పట్టం పుచ్చుకుని బావను చేసుకున్న జానకి మరోసారి ఆవులించింది.

కమల తలలో ఆలోచన నెగడై మండుతోంది. కర్రవిరిచి పొయ్యిలో పెట్టినట్టు ఫెళ పెళ లాడుతుంది రామాయమ్మ. "ఏనుగులా పెరిగిపోయావ్! నీకు మొగుణ్ణి చూడాలంటే వేలు-బంగారాలు-మూటలు చుట్టుకోవాలి. అతగాడేమో సంసారం పట్టించుకోడాయె. నా పిల్లల గతేంగాను. నీ యమ్మ చచ్చింది. నేనూ చచ్చుంటే తగువు తెల్లారిపోను."

కళ్లలో నీళ్లు తిరగడం అలవాటయి పోయిన కమలకి గుండెలో లోతుగా ముల్లు కలుక్కుమంది.

చీమ మిరపకాయ అన్నపేరు సార్థకం కమలకి అంటారు పై వాళ్లు. బందరు మిరపకాయలా సన్నగా పొడుగ్గా, మిలమిల లాడుతున్న చెక్కిళ్లతో కుర్రకారులందరికీ చూడముచ్చటగా, ముట్టుకుంటే చుర్రుమనేటట్టుంటుంది కమల.

టెన్త్ పరీక్ష కోసం తిరిగి తిరిగి గుండె గట్టి చేసుకున్న కమలంటే జానకికి అభిమానం. అసలు శివరాత్రికి గుంపయాత్ర కమల ఆలోచనే.

"మేష్టారికి చెప్పక్కా...నువ్ చెబితే కాదనరు."

మరో అరగంటలో జానకి స్నేహితురాళ్లందరికీ తెలిసిపోయింది. బాగా చీకట్లోనే బయలుదేరింది బండి.

"అసలు దేవుడిమీద మనుషులకి నమ్మకం సన్నగిల్లడానికి కారణం మనుషులా, దేవుడా?" కొత్తగా టీచరుగా చేరిన భానోజీ అడిగాడు రామాన్ని.

చీకటిలోంచి బయల్పడడానికి పోరాడుతున్న వెలుగు వంక చూస్తూ రామం చటుక్కున చెప్పాడు. "మనుషులు, తల్లిదండ్రులు, గురువు, సంఘం."

"అయితే మాష్టారూ, కుర్రకుంకను, అడుగుతున్నానని మరోలా..."చుట్టూ ఉన్న చీకటిని ఆసరా చేసుకుని ధైర్యం చిక్కబట్టుకుని మనసులోని సందేహాన్ని అడగడానికి ఉపోద్ఘాతం ప్రారంభించాడు భానోజీ, "మాష్టారూ, మీకు దేవుడంటే నమ్మకం వుందా?"

"అది భగవంతుడికి తెలియాలి."

"మీకు నమ్మకమే ఉంటే. ఏడుకొండల వాణ్ణి..."

"ఆపద మొక్కులవాడని కోట్లు అర్జిస్తున్నాడు మోతుబరి దేవుడు. సామాన్యుడికి అందకుండా ధర పెంచుకుంటూ నానాటికీ కొండలెక్కి పోతున్నాడు. మనకీ మనలాంటి వాళ్లకీ అందుబాటులో ఉండేది మన గుంపేశ్వరుడు. అతను పిలిస్తే మనం పలకాలి. మనం పిలవకుండానే అతను పలుకుతాడు."

"మీరు రివల్యూషనరీలండీ" నిట్టూర్చాడు భానోజీ.

"ఆ పదం వాడడం మనం ఎంత మానేస్తే అంత మంచిది. గుడ్డలు విప్పేయడం కాదోయ్ విప్లవాత్మకత. వస్తువుల్నీ, విషయాల్నీ, మనసు కోణంలో, రక్తంతో చూసి, అవగాహన చేసుకోగలగడం"

"మరి మా లాంటి వాళ్లకు దేవుడిమీద నమ్మకం కుదరాలంటే?"

"మనసుతో ఆలోచించు. మస్తిష్కంతో కాదు."

రామం అంటే అందరికీ గౌరవమే ఒక్క రంగారావ్‌కి తప్ప. రామం ఎందుకూ పనికిరాని వాడనీ, అతని భార్య జానకి గొడ్రాలనీ, రామానికీ ప్రైవేటు పిల్ల కమలకూ ఏదో సంబంధం ఉందనీ డోలు వాయిస్తూ కమల ఇంటి ముందు రోజుకి అరడజను సార్లు షికార్లు కొట్టడం రంగారావుకి అలవాటు.

అసలు రంగారావ్ స్వభావమే విచిత్రమైనది. ఆడపిల్ల వయసు లేతదైనా, ముదరదైనా ఫరవాలేదు. పండు రుచి పండుదీ, పింజ రుచి పింజదీ అంటాడు. పాతికేళ్ల క్రిందట స్కూలు ఫైనలు చదువు తున్నప్పటి నుంచీ అతనివరస ఇదేనని తెలిసినవాళ్లు చెబుతుంటారు. చిన్న ఊర్లలో అందరిగురించీ అందరికీ తెలియడం అబ్బురమూ కాదు, అనుచితమూ కాదు. కాని ఏది చేసినా, ఎవరికీ పబ్లీగ్గా ఆచూకీ దొరకని పద్ధతిలో చేస్తాడు రంగారావ్. తియ్యగా మాటాడుతాడు. నీటుగా ఉంటాడు. విలాసంగా ఖర్చు పెడతాడు. ఓ క్లాసు వాడు వాడికేం అంటారు ప్రజలు

రంగారావును అసహ్యించుకోవడం, అసహ్యించుకునే వారి అవగాహనా లోపమేనంటాడు రామం.

బళ్ల చక్రాలు ఇరుసులకు రాస్తూ ఉంటే గుయ్ మని శబ్దం. అబ్బ! అబ్బ! ఉన్నట్టుండి ఎంత వెలుగు వచ్చిందో రామం సంతోషంగా అన్నాడు.

"నాయుడూ, నాయుడూ, బండి ఆపవా, నే దిగి నడుస్తా" కమల నాయుడుని కుదిపేసింది.

"ఓ.హో, ఓహో" నాయుడు బండిని ఆపాడు. దిగ్గున గెంతి చెంగు చెంగున పరుగెత్తి బళ్ల ముందుకు సాగింది కమల.

"ఏం పిల్లమ్మా! ఏం కాలమో!" మీనాక్షమ్మ ఏవగించుకుంది.

"అదేమిటొదినా, పిల్ల సరదాపడింది. మనమంతా పరుగులెట్టిన వాళ్లం కాదూ? నడిస్తే తప్పా?" జానకమ్మ,

"లేదమ్మా, ఎగిరితే తప్పు." పూర్వ సువాసిని తల మీద బట్ట సర్దుకుంది.

"రాత్రి ఎలానూ భోజనం చెయ్యం..." హేమలత.

"బావుందమ్మా, రాత్రి భోజనం గురించి ఆలోచిస్తున్నావ్...అసలు బండి దిగగానే వడ్డించమనేటట్టున్నావ్" జానకమ్మ హాస్యమాడింది.

"పోన్లేవో, అందరూ ఒకలా ఉంటారా? కొందరు ఉపవాసం చెయ్యలేరు. అలాగే తల్లీ, బండి దిగగానే ఉప్మా, కాఫీ చేసేస్తాగా. ఎవరి శక్తికి తగ్గట్టు వారు చెయ్యాలి."

"అవునండీ, భక్తి, మంచితనం లాగే మనసులో ఉండాలి కాని ఉపోషాల వల్ల వస్తుందా?"

అక్కడికి తిండిగోల ఆపుచేసింది జానకి ఆ మాటలని.

బాగా తెల్లారిపోయి క్షేత్రం దగ్గరపడిందేమో మగాళ్లందరూ బళ్లుదిగి నడుస్తున్నారు.

"గుంపేశ్వరుడు నీకు మంచి మొగుణ్ణి ఇస్తాడులేవే బొట్టీ" ముందు బండిలో కూచున్న ముసలాయన అన్నాడు.

"బావుంది తాతా! నేను సంబరానికి రాకపోతే ఇవ్వడా?"

"బొట్టి శానా గడుస్ది. ఇటురాయమ్మా నచ్చీదేవినాగున్నావ్. ఆ అదుష్టమంతుడెవడో!"

"అందుకే నేనూ వెదుకుతున్నా అవ్వా" కమల ముందుకు వెళ్లిపోయింది కుచ్చిళ్లు సర్దుకుంటూ.

గిత్తలు విప్పి చెట్లకు కట్టారు.

పూర్వసువాసిని ముందు ఏటికి వెళ్లి మునిగివస్తానని బిందె పట్టుకు బయలుదేరింది.

"కమలా, మీ అమ్మ నిన్ను రానిచ్చింది అదీ దేవుడి దయే!" పక్కావిడ.

"అక్కతోనూ, మీతోనూ రావడానికి అమ్మకేం అభ్యంతరం? నాన్న నమిలెయ్యడూ?"

కృష్ణస్వామి అంటే రామాయమ్మకి బోలెడు భయమన్నట్టు చెప్పింది కమల. కాని ఊర్లో వాళ్లకి కృష్ణస్వామి సంగతి తెలియనిది కాదు.

మొదటి భార్య చనిపోయిన తరవాత మూడు నెలలు తిరగకుండా కమలని చూడడం కోసమేనన్నట్టు రెండో సంబంధం చేసుకున్నాడు. ఏటేటా పిల్లలు. చంటి, వెంటీ ఆరుగురయ్యారు. కమలకు న్యాయం చెయ్యాలని చేసుకున్న పెళ్లి అన్యాయంగా పరిణమించిందని తప్పుకునే ధైర్యంలేక కృష్ణస్వామి తను పనిచేసే మిల్లులో ఓ చక్రంలా అయిపోయాడు ఏడింటికి వెళితే రాత్రి పదింటికి తిరిగి రావడం జీతం రామాయమ్మకివ్వడం. ఆవిడ ఎంత చేస్తే అంత.

నలుగురితోపాటు కమలకీ పాఠం చెప్పాడు రామం. కాని మూడు బ్యాచిలు దాటినా కమల పాసవలేదు. ఇక చదివించనంది రామాయమ్మ. జానకికి కమలంటే జాలి. తాను చెయ్యగలిగింది లేదని విచారం.

రామం, భానోజీ వంటకి కావలసిన సౌకర్యాలు ఆడవాళ్లకి సమకూర్చి అలా తిరగడానికని బయలుదేరారు. వాళ్ల వెనకాలే బయలుదేరిన కమల భోజనాల వేళకి కూడా తిరిగి రాలేదు.

హేమలతా, కామాక్షమ్మా, వెంకటలక్ష్మీ అంతా కంగారుపడ్డారు. జానకి మొహం జేవురించింది.

రామం తన ఆత్రతను బయటకు కనపడనియ్యకుండా ముందు భోజనాలు కానివ్వండి అని చెప్పి రెండు మెతుకులు ఆదరా బాదరా తిని భానోజీనీ వో వంక పంపి, తనూ మరో సైకిలు పుచ్చుకుని మరోవంక బయలుదేరాడు. తెలిసిన వాళ్లందరినీ వాకబు చేస్తూ గ్రామం చేరాడు భానోజీ.

తెలిసిన మరో టీచరు భానోజీని గేలిచేశాడు. "ఏంవోయ్. పచ్చిమిరపకాయకి దూరంగా ఉండడం మంచిది. కళ్లలో రంయ్ మని నీళ్లు తిరుగుతాయి జాగ్రత్త"

రామం తిరిగి తిరిగి రామాయమ్మగారింటికి వచ్చాడు. అతను తెచ్చిన వార్త విని ఆశ్చర్యపోలేదు

రామాయమ్మ.

సాయంకాలానికి మళ్లీ తీర్థానికి చేరిన రామం, భానోజీ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

మన బాధ్యత తీరిపోయింది మాష్టారూ! ఆ అమ్మాయి తల్లి తండ్రులకి చెప్పాం. ఇక మనం చెయ్యగలిగినదేముంది? ఇంతకీ అమ్మాయి బొత్తిగా నోరు లేనిది కాదుగా! మీరు అవసరమనుకుంటే పోలీసు రిపోర్టు...

"గుంట రంకుముండ! అదేం తక్కువదా! పోలీసు రిపోర్టిచ్చి వాళ్ల వెనకాల నువ్వేం తిరుగుతావ్‌లే నాయనా!" హేమలత అందుకుంది.

జానకి బిత్తరపోయింది. కమలకోసం తీర్థం సందడి ఆగిపోలేదు. రాత్రి ఏడింటినించీ సంబరాలు ప్రారంభమయ్యాయి.

నారాయణదాసు రాసిన రుక్మిణీకల్యాణం హరికథ. మరోపక్క విజయనగరం ఫేమ్ కుమ్మరి మేష్టరు బుర్రకథ. మరోదగ్గర మూడు గుర్రాల బీడి ఎడ్వర్‌టైజ్‌మెంట్ రాజమండ్రి ట్రూప్ రికార్డు డాన్స్. టూరింగ్ హాల్లో మల్లీశ్వరి బొమ్మ.

వింత వింత ప్రదర్శనలూ, మేళతాళాలూ, మైకులో పాటలు.

ఎల్లమంద కోటయ్య ఏలుకో, ఏలుకో చెయ్యి కాస్త అందించి చేదుకో చేదుకో హరోం హరా! హరోం హరా!

కోలాహలంతో చెవులురింగ్‌మంటున్నాయి

మాష్టారూ, మాష్టారూ మన స్కూలు అబ్బాయి చూశానని చెప్పాడు. మీరేం కంగారు పడకండి. ఆ అమ్మాయి రంగారావ్ సైకిల్ వెనకాల కూచుందట. పోనీ ఈ రోజు కాకపోతే పదిరోజులనాడైనా తిరిగి వచ్చేస్తుంది.

భానోజీ హరికథ వెనకాలకొచ్చి రామంతో చెప్పాడు.

అంతే నంటావా?

ఉండండి. మీవాళ్లకు కూడా చెప్పి వస్తా! ముందుకు వెళ్లాడు భానోజీ.

చూడు పిల్లా, నే చెబితే విన్నావా! అబ్బొంచినాడా, అయ్యొంచినాడా అని, దానికి కండకావరం. ఇలాంటి లండనెత్తు ఏదో వేసే బయలుదేరదీసింది మనందరినీ.

రుక్మిణీ కళ్యాణం వినడంలేదు హేమలతగారు.

జానకికి మరి అక్కడ ఉండబుద్ధికాలేదు.

ఇంటికి పోదామండీ 'రామం కళ్లలోకి చూస్తూ అంది.'

అది తెలివి తక్కువతనం. మనం వచ్చింది ఆ అమ్మాయికోసం కాదు. జాగరం చేసి, దేవుడి దర్శనంచేసి మరీ వెళదాం. నిజం నిలకడమీద తెలికయపోదు...ఏమండోయ్-మీరు మాత్రం ఆ అమ్మాయిని ఆడిపోసుకోకండి హేమలతగారితో ఏనాడు మాటాడని రామం ఘాటుగా చెప్పాడు.

ప్రత్యేకమైన ప్రయత్నంకాని, హరికథ, బుర్రకథ, ఇత్యాది కాలక్షేపాల అవసరం లేకుండానే జాగరం అయిపోయింది రామారావ్‌కీ, జానకమ్మకీ. తెల్లవారి స్నానాలూ దర్శనాలు ముగించుకుని ఇళ్లు చేరారు.

ఊళ్లోకి తిరిగి వచ్చాక దుమారం వస్తుందని ఊహించిన జానకికి ఏ రకమైన గొడవా చెవిన పడలేదు.

ఇరుగుమ్మా, పొరుగమ్మా, తేలికగా రామాయమ్మనీ, కృష్ణస్వామినీ, కమలనీ అక్కడి కక్కడే దుయ్యపట్టడం జరిగిపోయిందేమో, రెండు రోజులలో కమల లేచిపోవడం చరిత్రలో భాగమైపోయింది. కాని విషయమేమైనా తెలుస్తుందేమోనన్న ఆశతో కమల ఇంటికి వెళ్లకుండా వుండలేకపోయింది జానకి. దాని దోవన అదిపోతే, అవునమ్మా, నీ కెందుకుటా అంత బెంగ? అదేం తెలివితక్కువది కాదు. మూడు ముళ్లూ పడిఉంటే ముగ్గురి బిడ్డల తల్లి అయేది? నీలాగేం కాదు. జానకి మనసు కలుక్కుమంది. పోనీ నన్నేకదా ఆడిపోసుకుంటారు...సవతి తల్లి ఎంత ప్రేమగా చూసినా తల్లి కాదుగా? జిర్రున చీది చీర కొంగుతో ముక్కూ, కళ్లూ తుడుచుకుంది రామాయమ్మ.

ఇంటిలో గొడవేమైనా జరిగిందా? అని అడగాలనుకున్న జానకికి మరి ధైర్యం చిక్కలేదు.

మరో రెండు రోజుల తర్వాత రామం మాష్టారికి వో ఉత్తరం వచ్చింది. కవరు మీది ఎడ్రసు ఎవరో చిన్నపిల్లలు రాసినట్టుంది. ఎక్సరసైజు పుస్తకము నుంచి కాయితాలు. లోపల దస్తూరీ కమలది.

రామం మాష్టారికి

నమస్కారాలతో కమల.

నిజమే అఘాయిత్యమే. నాగోడు ఎవరితో చెప్పుకోను? ఏ ప్రయోజనం ఆశించి?

ఒకరికొకరు సహాయపడిన పరిస్థితులు బ్రతుకులో కొన్నే. నాకు దేవుడు కూడా సాయంచేసే స్థితిలో ఉండడు.

మిమ్మల్ని మోసం చెయ్యాలనే చేశాను. కాని ఇలా జరుగుతుందనుకోలేదు. మళ్లీ జన్మలో మీ కాళ్లమీద పడతాను నాకు మనిషి జన్మే ఎస్తే!

జాకెటు ముక్క కొనలేడు నాన్న! చదువు వంటబట్టదు నాకు. పోకిరీ వెధవలకు ఊసుపోక నేను. అరుగుమీద కూచుని వాళ్లని చూస్తూ కాలక్షేపం చెయ్యడం నాకు ఊసుపోక.

ఒక్కడూ వెళుతున్నప్పుడు వెర్రివెంగళాయి మహా మర్యాదగా తలవంచుకుని దొంగ చూపులు చూస్తూనే నడుస్తాడు నలుగురితో కలిసివస్తున్నాడో మరి వాడి హొయలుకు అడ్డూ ఆపూ ఉండవు. అప్పుడు వాళ్లకి నేను లోకువ. వాడు ఒంటరిగా వస్తుంటే, నన్నుచూసి మెలికలు తిరిగి పోతుంటె బుర్ర భూమిలోకి దించేసి వోరకంటితో దొంగ చూపులు చూస్తుంటే నాకు లోకువ. ఆ ఎర్రగళ్ల చొక్కా, బూచి బుర్రవాడిని చూస్తే నాకు మహా...ఒరేయ్ పిచ్చబ్బీ ఎందుకురా అంత మొగమాటం! నలుగురితో కలిస్తే తప్ప నా వంక చూడవన్నమాట...

ఉన్న మాట అనేస్తా! అది ఆడపిల్ల లక్షణం కాదంటుంది మా రామాయమ్మ.

నాన్నకి అమ్మంటే బులపాటం ఆగదు. అమ్మకి వద్దనే వోపికకూడా ఉండదేమో! అరిచి, అరిచి, చాకిరీ చేసిచేసి శవంలా పడుకుంటుంది. శవంమీద కోరిక తీర్చుకునే వాళ్లూ ఉంటారని ఎక్కడో చదివాను. రోజూ చూస్తున్నాను, నాన్నకదే ఎంటర్ టెయిన్‌మెంట్. బీదవాళ్లకి కూడా పెద్ద ఇళ్లుంటే ఇల్లాంటి దృశ్యాలు కళ్లారా చూడక్కల్లేదు చిన్నవాళ్లు.

నాకు కంటికి కునుకురాదు. కష్టపడితేగా అంటుంది రామాయమ్మ. తెల్లవారిన దగ్గరనుంచీ

వీధి గుమ్మం పిలుస్తూనే ఉంటుంది. తరవాణీ అన్నం తిన్న దగ్గరనుంచి నాన్న తిన్న కంచం రాత్రి కడిగేవరకూ అయిదు నిముషాలకొకసారైనా వీధిలోకి రావాలి.

వంశం, గౌరవం, వల్లకాడూ ఇవన్నీ వదిలేసి నాలాంటి కమలలు విస్తరంటలు కుట్టో. కాగితాల సంచులు అంటించో పొట్టపోసుకునే మార్గం వెదుక్కోవడం అవసరం. ఆడిపిల్లలను పోషించడానికి అల్లుళ్లని వెదకడం కాదు వో జీవనాధారం, అవకాశం చూపించడం పెద్దల కర్తవ్యం.ఈ గుప్త జ్ఞానాన్ని పెద్ద కుటుంబాలవాళ్లు తెలుసుకుంటే కమల నీటిలో మునిగిపోదు. కలకలలాడుతూ విలాసంగా నీటిలో ఊగుతూ, తేలుతూ ఉంటుంది.

ఎంతమంది కథలకి నాయకివైనావో, నా కన్నీళ్లూ, నా బాధలూ, వాళ్లు చూసి ఊహించినట్టు పోజుపెట్టి రాస్తారు. నిజంగా అడగండి పీలికల్లో దాచుకోలేని బిచ్చగత్తె పడుచుదనం చూసి ముచ్చటపడనిదెవరు? రూపాయిన్నర టిక్కెట్టుకొని నా పక్కకొచ్చి కూచునే బూచిబుర్ర నడగండి! వాడు వెదికేదీ, ఎదురుగా కంటికి కనపడుతున్నవీ. పక్కచేతికి అందుబాటులో ఉన్నవీ. అన్నీ వంపులే.

మన వీధి రోడ్డు ఆ చివరనుంచి ఈ చివర వరకూ నాలుగుసార్లు తిరిగితే నేను రెండున్నర కథలకు మెటీరియల్ ఇస్తాను. వెధవ పరీక్షంటే పోతోందికాని, నాకేం తక్కువ. నేను రచయితలకి గోల్డ్‌మైన్‌ని. పరీక్షల్లో మార్కులంటే రాలేదుకాని, నాకు కావలసిన జ్ఞానం నేను సంపాదించుకున్నాను. నూటయాభై రెండు నవలలూ, ఎనిమిదివందల యాభైమూడు కథలూ కాచివడపోశాను. మూడు నవలలకి ప్లాట్లు ఎక్సరసైజు పుస్తకాల్లో రాసుకున్నాను. ఇక కథలా, నా తలనిండా అవే! చేతిలో పుస్తకం వారపత్రిక, మంత్లీ, బొమ్మలున్నవీ, లేనివీ, ఏదైనాసరే చేతిలో పుస్తకం ఉన్న కుర్రాళ్లందరితోనూ మంచిచేసుకుని మాటాడాను. పుస్తకాలు పుచ్చుకున్నాను. తరవాత తరవాత దులిపి మరీ ఇంట్లోకి తీసుకువెళ్లడమూ నేర్చుకున్నాను. కళ్లలో నీళ్లు తిరగకుండా చెవులకు ఆ కథలు అడ్డం పెట్టుకునే చదివేదాన్ని. తరవాత కడుపు నిండా చీవాట్లు తినేదాన్ని. మాష్టారూ, మీరు రచయితైతే నా బాధని ప్రజల కర్థమయ్యేటట్టు రాయగలిగేవారేమో!

అక్క ఏమంది? నాకు మరి తెలిసే అవకాశం లేదు.

"రంకుముండ సంగతి నాకు ముందే తెలుసు" అని అంటుంది హేమలతమ్మగారు. ఏమిటో పాతకాలం మనుషులు. వాళ్లు చెయ్యలేకపోయిన పని ఎవరు చేసినా ఆగ్రహమూ, అసూయా-ఏదీ తెలియకుండా, తెలుసుకోవాలనయినా తెలియకుండా, సతమతమయ్యే మూగజీవాలు. వాళ్లంటే నాకు బోల్డు జాలి.

కథలు రాసే వెంకట్రవణమూర్తికి నేను ఆదాయాన్ని ఎన్ని కథలు రాశాడు నా మీద, రక్తం ఉడుకులెత్తేలా ఒళ్లు జలదరించేలా సెక్స్‌సీన్లు కుమ్మేసి నన్ను ఆలిచిప్పలా అరగదీసేశాడు. మనియార్డర్లూ, చెక్కులు వాడివి. అరిగిపోవడం నాది.

నాకు చదువు మరి వంట బట్టదు మాష్టారూ! పాఠశాలలకీ, పరీక్షలకీ అతీతంగా ఎదిగిపోయాను.

మొదటిసారి బట్టలు మూటలు కట్టినపుడే జ్ఞానాన్ని మూట కట్టేస్తుంది నాలాంటి ఆడపిల్ల. ఇది నాలాంటి వాళ్లు పుట్టుకతోనే సంక్రమింప చేసుకున్న శాపం.

నాకు వంటమనిషి ఉద్యోగమైనా చెయ్యాలనే ఉంది. నువ్ వంట చెయ్యడమా! నాన్‌సెన్స్

అంటాడు రంగారావ్. వంశంతోపాటు వచ్చిన వరహాలు లేకపోయినా, గంగాళాలతో కొలవదగిన గౌరవం మన వంశానికింకా ఉందని మావాళ్ల భేషజం.

ఫీజులూ, మారిపోయిన పుస్తకాలు, ఇవన్నీ మావాళ్లకి బరువు. ఆ పూటా, ఈ పూటా ఇంత తిండిపడేస్తే వాళ్లబాధ్యతసరి.

ధైర్యంలేని మనుషులు. ఆత్మవిశ్వాసం లేని మనుషులు. అహంకారం లేని మనుషులు. నెత్తురు లేని మనుషులు.

ఆగండి. ఇవన్నీ నాకులేవు. నాకేం? జీవితాన్ని ఎదిరిస్తానని విర్రవీగా ననుకున్నాను. మేకవన్నె పులి రంగారావ్ అని ఎవరికి తెలియదు? పులిని బోనులో పెడదామనుకున్నాను. అడకత్తెర్లో చిక్కుకున్నాను. అహం దెబ్బతిన్న ఆడపిల్లకి ఆత్మహత్య శరణ్యం. గేలంతో చేపను పడదామనుకున్నాను. కాని ఆ చేపన్ను నేనే. గొంతుకలో ముల్లు గుచ్చుకుంది.

రంగారావ్ స్నేహం చేశాను. లొంగదీసుకున్నాననుకున్నాను. నెలతప్పానని చెప్పాను. ముహూర్తం మంచిది కాదేమో శివరాత్రి గంగలో దూకేయ్ సమస్య పరిష్కార మవుతుందని చెప్పి అర్ధరాత్రి సైకిలెక్కేశాడు. సంగాంక్షేత్రంలో నే నెవరిని?

ఇతరులను నేను అన్న మాటలు కకావికలైన నా మనసు అదుపుతప్పి చేసిన ప్రలాపాలు. ఎంత ధైర్యంలేని మనిషిని కాకపోతే బ్రతుకు ఇలా బండలు చేసుకుంటాను?

నన్ను చూసి జాలిపడే మనిషి నన్ను గురించి ప్రజలు దుమ్మెత్తి పోస్తుంటే నిట్టూర్పులు విడిచేది మీరొక్కరే!

తెలుగు మాష్టారి ధర్మమా అంటూ అరిషడ్వర్గాలంటే ఏమిటో తెలుసుకున్నాను. ఏమమ్మా తల్లీ. అంటూ వీపు నిమిరే ఉదారులు కళ్లతో దాహం తీర్చుకోగలిగిన నేర్పరులు. పాపం ముసలాళ్లు!

పాపం అంటే నాకు భీతి లేదు. కారణం పాప మన్నది మనిషి మీద పరిస్థితులు చేసే కుట్ర. బాధ్యతని మనిషి మీదకి నెట్టేసి వికృతంగా నవ్వుతూ, నువ్ ఏమాత్రం మనిషివి నీ తెలివి తేటలింతేనా? అని ఎగతాళి చేస్తూ ఎక్కడివక్కడ సర్దుకుంటాయి పరిస్థితులు.

లోకంలో పుణ్యాత్ములు కాదు, అవతల మనిషిని అవగాహన చేసుకోగలిగిన వారు ఉన్నారని భగవంతుడు చూపడానికి నిదర్శనం లాంటివాళ్లు మీరు. ఎద్దుమొద్దు స్వరూపమైన విగ్రహాలకి ఇవన్నీ ఎలానూ చెప్పలేను. నా అక్కసంతా బయటకు వెళ్లగక్కాలి. నామనసు తేలిక పడాలి. అప్పుడు సులువుగా మునిగిపోగలను చేసిన పాపం చేసినవాడు చెప్పినంత మాత్రాన పోదు. ఇతరులు అవగాహనతో దానిమీద జాలి చూపిస్తే పోతుందని నానమ్మకం.

ఉత్తరం మీకు చేరుతుందనే ఆశ. బడిపిల్లలు దైవసమానులు. ఈ బాబు ఉత్తరం కవరులో పెట్టి పోస్టుచేస్తానన్నాడు. నాపెన్ను ఆ అబ్బాయి దగ్గర ఉంటుంది శాశ్వతంగా.

ఇంత చీకటిలోనూ ప్రవాహం మిలమిలా మెరుస్తూంది. అదే సత్యం అదే నిత్యం. పాపానికి పుణ్యానికీ అతీతం ఈ ప్రవాహం. నా లాంటి కమలలూ, రంగారావ్ లాంటి తుమ్మెదలూ, పొడుగు సూర్యారావ్ మేష్టారి లాంటి కందిరీగలూ, అందరూ వో రోజు పూసి వో క్షణం తలలు ఎగరవేసి వో తృటి విర్రవీగి నేల కొరగాల్సిందే.

పునర్జన్మలో క్షమాపణ చెప్పుకునే అవకాశం కోసం ఎదురుచూస్తూ. కమల.

రామం ఉద్రేకంగా అడిగాడు రంగారావ్‌ను కమల ఏమైందో తెలుసా అని. రామారావ్ నువ్వూ అందరిలా అపోహపడే అల్పిష్టివనుకోలేదు. నాకు సకాలంలో పెళ్ళయితే ఈ యీడు అమ్మాయి ఉండేది.

అవాక్కయి పోయాడు రామం.

కమల రాసిన ఉత్తరంతీసి చూపించాలనుకున్నాడు కాని...రంగారావ్‌తో ఏంచెప్పి, ఏంచూపి ఏంలాభం?

మూడు శివరాత్రులు గడిచాయి.

కడుపున బడ్డ నలుసును ప్రసవించలేక కన్ను మూసింది జానకి. శివరాత్రి వస్తూనే ఉంది. ఒంటరిగానైనా దర్శనం చెయ్యడం మానలేదు రామం. ఏమీలేని కమల ఆత్మహత్య చేసుకుంది. అన్నీ ఉన్న జానకి హఠాత్తుగా పోయింది. దుఃఖం సత్యమా, జీవితం దుఃఖమేనా అడిగాడు భానోజీ.

"బోధ పడనిదాని కంతటికీ కీలకం రెండు మాటల్లో చెబుతారు మనవాళ్లు! దేవుడిలీల" అనేశాడు రామం.

ఎప్పుడోకాని కమల గుర్తుకు రాదు రామానికి. బ్రతుకులో ఎన్నో వ్యథలు, మలుపులు ఏ ఒక్కటీ నిరవధికంగా ఉండదు.

స్కూలుకు వేళవుతోంది.

"మేష్టారున్నారా?"

కళ్లజోడు తియ్యలేదు వచ్చినావిడ. బయట బ్రీఫ్‌కేస్ పట్టుకుని ఒకాయన.

"స్కూల్లో కలిసినా మాట్లాడ్డానికి వీలవదని మొదటి బస్సుకే వచ్చా!"

కళ్లజోడు తీసింది కమల.

శిల అయిపోయిందనుకున్న గుండె స్పందిస్తోంది.

"వీరు మావారు...కేరళలో..."

"నమస్కారం."

"నే రాసిన ఉత్తరం చింపెయ్యండి మాష్టారూ. బ్రతుకును అర్థం చేసుకోడానికి కూడా దైవకృపే కావాలి. ఆనాడు నాకు చెయ్యి అందించి చేదుకున్న హరుడుఈయనే. ఇంతకీ అక్క ఏదీ!"

ఆమె కళ్లలో, ముఖంలో, వెలుగుదొంతరలు మిరుమిట్లు గొలుపుతూ ఉంటే 'జానకికేం భేషుగ్గా ఉంది. పాఠానికి వేళయింది' అంటూ తాళంకప్పా చెవులూ పట్టుకుని లేచాడు రామం.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 17.3.1978